క్లుప్తంగా

కోలాహలం.. రథోత్సవం



రథంపై ఊరేగుతున్న స్వామివారు

కుప్పం రూరల్: మున్సిపాలిటీ పరిధి లక్ష్మీపురంలోని శ్రీవరదరాజులస్వామి రథోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఏటా దసరా సందర్భంగా జరిగే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గ్రామంలో రథాన్ని ఊరేగించారు. భక్తులు గోవిందనామస్మరణతో రథాన్ని లాగేందుకు పోటీలు పడ్డారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పేకాటరాయుళ్ల అరెస్టు చూపుతున్న ఎస్ఐ

ఐరాల: మండలంలోని బొమ్మసముద్రం వద్ద శుక్రవారం రాత్రి పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు కాణిపాకం ఎస్ఐ ధరణీధర తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. బొమ్మసముద్రం గ్రామం సమీపంలో ఓ అరటి తోటలో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడి చేసి, ముగ్గురిని అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారైనట్లు ఆయన తెలిపారు. వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలు, రూ.6,040 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

కాణిపాకంలో రీజినల్ జాయింట్ కమిషనర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శుక్రవారం తిరుపతి దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారి చిత్ర పటం, ప్రసాదం అందజేశారు. చిత్తూరు నగరంలోని దుర్గాంబను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దుశ్శాలువాలతో సన్మానించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కాణిపాకం ఈఓ గురుప్రసాద్, జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ చిట్టెమ్మ, దుర్గాంబ దేవస్థాన ఈఓ మునిశేఖర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అన్నదాన కార్యక్రమం



భోజనం తెచ్చిన వాహనం ముందు సభ్యులు

గంగాధరనెల్లూరు: పీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎంపీ శ్రీధర్‌రెడ్డి ఆర్థిక సాయంతో రోగులకు శుక్రవారం అన్నదానం చేశారు. సహాయ సహకారాలు అందించిన డాక్టర్ దుర్గాదేవి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుర్గాదేవి మండల రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ పాపిరెడ్డి, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ తెలిపారు. శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తూ తన వంతు బాధ్యతగా ప్రజా సమస్యలపైన పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో గౌరవంగా మసలుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల్లా ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు విజయ్‌కుమార్, రమాదేవి, రవి, రఘు, ప్రకాష్, విజయచందర్, బాబు, జయచంద్ర పాల్గొన్నారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి

కాణిపాకం: కాణిపాకం బ్రహ్మోత్సవాల ఖర్చులకు సంబంధించిన శ్వేతపత్రం విడుదల చేయాలని ఏపీసీసీ మాజీ కార్యదర్శి పరదేశి ఒక ప్రకటనలో తెలిపారు. కాణిపాక ఆలయ ట్రస్టు బోర్డ్ చైర్మన్ ఏర్పాటు చేయలేదని చెప్పారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని తెలిపారు. వీటిని నిరసనగా ఈనెల 31న నిరసన కార్యక్రమం చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

రియల్‌కు రెక్కలు!

- వెంచర్లుగా మారుతున్న వ్యవసాయ భూములు
- 4 నెలలుగా అమాంతం పెరిగిన ధరలు
- బెంగళూరుతో పోటీ పడుతున్న ఇంటి స్థలాలు
- కూటమి నేతల వెంచర్లకే రిజిస్ట్రేషన్ అనుమతులు
- సొంతింటి కలలపై పసుపు నీళ్లు



కుప్పం పట్టణం సమీపంలోని లేఔట్

కుప్పంరూరల్: కుప్పం నియోజకవర్గంలో అధికారిక, అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్లలో ఇంటి స్థలాల ధరలకు రెక్కలు వచ్చాయి. గత జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరలు రెట్టింపయ్యాయి. సామాన్య, మధ్య తరగతి జనం స్థలం కొని ఇళ్లు కట్టుకోలేక సొంతింటి కల కలగానే మిగిలే పరిస్థితి తలెత్తింది. కొత్త ప్రభుత్వం వచ్చాక స్థానికంగా ఎలాంటి కొత్త పరిశ్రమలు, వ్యాపారాలు రాకున్నా రియల్టర్లు, బ్రోకర్లు ఆడుతున్న ఆటతో నివాస స్థలాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అధిక ధరలకు కొనేవారు అంతంతగాఉన్నా, లేని డిమాండు ఉన్నట్టు దళారులు బూమ్‌ను సృష్టిస్తున్నారు. నాలుగు నెలల క్రితం రూ.800 ఉన్న చదరపు అడుగు ఉన్న లేఔట్‌లో ఇప్పుడు రూ.1,800 వరకూ పలుకుతున్నాయి. ఇంతకంటే తక్కువ ధరలో ఔటర్ బెంగళూరులోనే స్థలాలు కొనవచ్చనే చర్చ స్థానికంగా సాగుతోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వందకుపైగా ప్రైవేటు వెంచర్లు ఉన్నా, వాటిలో స్థలాలు చేతులు మారుతున్నా అక్కడ ఇళ్లను నిర్మించేవారు కరువయ్యారు. ఏళ్ల తరబడి పిచ్చిమొక్కలతో దర్శనం ఇస్తున్న లేఔట్లలో నిర్మాణాలు లేక పిచ్చిమొక్కలు పెరుగుతున్నా, మరోవైపు కొత్త లేఔట్లు మాత్రం పుట్టుకొస్తున్నాయి.

పచ్చ చొక్కాలదే వ్యాపారం

రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరాక కుప్పం నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పచ్చ చొక్కాల చేతుల్లోకి వెళ్లిపోయింది. నియోజవర్గ వ్యాప్తంగా 60 వరకూ వెంచర్లలో ప్రస్తుతం వ్యాపారాలు సాగుతుండగా అన్నీ వారి ఆధీనంలోనే ఉన్నాయి. ఇతర పార్టీల వారు, రాజకీయాలతో సంబంధంలేని వారు అప్పటికే చేస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్లు కూడా బలవంతంగా తమ్ముళ్ల వశమయ్యాయి. ఇతరుల సైట్లు రిజిస్ట్రేషన్లు జరగకుండా అనధికారిక నిషేధం అమలు చేస్తున్నారు. దీంతో చేసేది లేక తెలుగు తమ్ముళ్లకు తమ వెంచర్లు అప్పగించి ఇచ్చినంత తీసుకుంటున్నారు.

సామాన్యుడికి ఏదీ ఊరట ?

రియల్ మాఫియా ఆడుతున్న వ్యాపార క్రీడలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడక తప్పడం లేదు. భూముల ధరలు ఆకాశాన్ని తాకడంతో తమ పొలాల పక్కన ఉన్న వ్యవసాయ భూములను రైతులు కొనలేని స్థితి ఏర్పడింది. మరోవైపు రియల్ మాయతో చదరపు అడుగుకు ప్రాంతాన్ని బట్టి రూ.1,500 నుంచి రూ.10 వేల వరకూ చెల్లించి కొనుగోలు చేసి ఇళ్లు కట్టలేకపోతున్నారు. ఈ వ్యాపారంలో ప్రభుత్వ నిబంధనలు, లేఔట్ల మార్గదర్శకాలను పూర్తిగా తుంగలో తొక్కి, అక్రమ లేఔట్ల వ్యాపారం చేసినా అధికారులు చర్యలు తీసుకునే సాహసం చేయలేకపోతున్నారు. రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్, తాగునీరు, సామూహిక అవసరాలకు స్థలం కేటాయింపు లాంటి కనీస వసతులు కూడా లేఔట్లలో ఉండడం లేదు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగించుకునే అనుమతులు కూడా పొందడం లేదు. ఈ పరిస్థితులపై మధ్యతరగతి ప్రజలతో పాటు టీడీపీలోని మేధావి వర్గం కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నా, అధికార పెత్తనం వెలగబెడుతున్న వారిని ఎదిరించలేక మౌనం దాల్చుతున్నారు. ఏ వెంచర్లో వేలు పెడితే ఏ నాయకుడు బూతులు తిడతాడో తెలియక పట్టించుకోవడమే మానేయడంతో అక్రమ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అడ్డులేకుండా పోయింది. కుప్పం ప్రాంతానికి ప్రత్యేకంగా కడ(కుప్పం ప్రాంత అభివృద్ధి అథారిటి) ఉన్న నేపథ్యంలో ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారంపై రాజకీయ వివక్ష లేకుండా నియంత్రణ విధించి, చట్టాలను అమలు చేసే పరిస్థితులు కల్పించాలని అధికారులు కోరుతున్నారు.

జిమ్మిక్కుల వ్యాపారం

రాబోయే పలానా పరిశ్రమ ఎదుట లేఔట్, ఎయిర్ పోర్టు వద్ద లేఔట్, బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన సైట్ అంటూ లేని అభివృద్ధిని చూపుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇతర పట్టణాలకు చెందిన ఫైనాన్షియర్ల పెట్టుబడితో స్థానిక రియల్ వ్యాపారం సాగుతోంది. ఆ ప్రాంతంలో భూమి ధరలకు 50 శాతం వరకూ అదనపు ఆశ చూపి రైతుల నుంచి ఎకరాల కొద్దీ భూములు కొనుగోలుచేస్తున్నారు. భారీ మొత్తం కాబట్టి రిజిస్ట్రేషన్‌కు 4-6 నెలల గడువు కావాలంటూ అడ్వాన్స్ ఇచ్చి రైతులతో అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు. ఆయా భూములను కొంత అభివృద్ధి చేసి లేఔట్లు వేస్తున్నారు. వాటిలో సైట్లను విక్రయిస్తూ భూమి యజమానికి ఇవ్వాల్సిన సొమ్ము పోగవగానే తన నుంచే నేరుగా కొనుగోలు చేసిన వారి పేరుకే రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు.

ఓట్లు వేయలేదని దాడులు తగదు



పార్టీ శ్రేణులతో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి

- జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి

రొంపిచెర్ల: గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేయలేదని రొంపిచెర్ల మండలంలో ప్రజలపై దాడులు చేయడం టీడీపీకి తగదని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మోటుమల్లెలలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత 100 సంవత్సరాలుగా ఎప్పుడూ జరగని దాడులు నేడు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్నాయని ఆరోపించారు. దాడుల్లో రూ.కోట్ల విలువ చేసే 65 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆస్తులను టీడీపీ మూకలు ధ్వంసం చేశారని అన్నారు. ప్రజా ఆస్తులను కూడా ధ్వంసం చేశారని తెలిపారు. బిహార్ తరహాలో టీడీపీ నేతలు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా తమ ధోరణి మార్చుకోవాలని సూచించారు. దాడులు ఇలాగే కొనసాగితే అదే తరహాలో సమాధానం చెప్పాల్సివస్తుందని హెచ్చరించారు. దాడులపై డీజీపీకి, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా, సూర్యనారాయణరెడ్డి, డి.నాగిరెడ్డి, సిరాజున్నీసా, సిద్ధరామిరెడ్డి, విజయశేఖర్‌బాబు, శ్రీనాథనాయుడు, కుమార్‌నాయుడు, రామకృష్ణనాయుడు, కుమార్‌రెడ్డి, కమలాకర్ రెడ్డి, నాగరాజ పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో దరఖాస్తుల వెల్లువ

- 320కి చేరిన మద్యం షాపులకు దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.6.40 కోట్ల ఆదాయం

కుప్పం: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మద్యం పాలసీ విధానం ద్వారా కుప్పం నుంచి ప్రభుత్వానికి రూ.6.40 కోట్ల ఆదాయం వచ్చింది. నియోజకవర్గంలో 10 మద్యం షాపులకు దరఖాస్తులను ఆహ్వానించింది. పది రోజుల పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు వేశారు. శుక్రవారం చివరి రోజు కావడంతో 10 షాపులకు ఒకేరోజు 45 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుకు రూ.2 లక్షలు ప్రవేశ రుసుంగా నిర్ణయించారు. కుప్పం నియోజకవర్గంలోని పది దుకాణాలకు టెండర్ల ద్వారా రూ.6.40 కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరింది. ప్రధానంగా గుడుపల్లెకు కేటాయించిన ఒక్క దుకాణానికే 40 దరఖాస్తులు వచ్చాయి. మున్సిపాలిటీలో ప్రతి షాపునకు 30కి పైగా రాగా, రామకుప్పం మండలానికి కేటాయించిన రెండు షాపులకు 30 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. కుప్పం చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా మద్యం టెండర్లకు పోటాపోటీగా వ్యాపారులు దరఖాస్తులు వేయడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. 14వ తేదీ సోమవారం చిత్తూరులోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో లాటరీ పద్ధతిలో మద్యం షాపులు కేటాయిస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వెదురుకుప్పం: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎర్రగుంటపల్లె గ్రామంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల ద్వారా చికున్‌గున్యా, డెంగీ, మలేరియా, ఫైలేరియా వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నివాసాల వద్ద వృథా నీటిని నిల్వ ఉంచుకోకూడదన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌బాబు, పర్యవేక్షకుడు మోహన్ మురళీనాథ్, ఏఎన్‌ఎం సుధ, ఆశావర్కర్లు సుమతి, పుష్ప పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి

మహిషాసురమర్దినీ.. నమోస్తుతే!





బోయకొండలో మహిసురమర్దినిగా గంగమ్మ, గంగవరంలో..



రొంపిచెర్లలో..



పుంగనూరులో..



పుంగనూరులో..



సదుంలో..



పలమనేరులో..



వి.కోటలో..

చౌడేపల్లె: శరన్నవ రాత్రుల్లో భాగంగా బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారు శుక్రవారం శత్రు సంహారి మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులను కటాక్షించారు.

గంగవరంలో..

గంగవరం: మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన మలాలమ్మ ఆలయంలో అమ్మవారు విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులను కటాక్షించారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని శ్రీభోగనంజుండేశ్వర స్వామి ఆలయంలోని పార్వతిదేవి, విరూపాక్షి మారెమ్మ మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులను కటాక్షించారు. అలాగే బజారువీధిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవిని, తూర్పుమొగసాలలోని చాముండేశ్వరిదేవిని ప్రత్యేకంగా మహిషాసురమర్దినిగా కొలువుదీర్చారు.

సదుంలో..

సదుం: రెడ్డివారిపల్లె చామంతుల ఎల్లమ్మ, స్థానిక సదుమమ్మ, జాండ్రపేటలో రామలింగ చౌడేశ్వరీదేవి, పచ్చార్ల మాకులపల్లె గంగాపురమ్మ ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించారు.

వి.కోటలో..

వి.కోట: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో వెలసిన వాసవీ మాత, దుర్గాదేవి ఆలయంలో వెలసిన అమ్మవారు శుక్రవారం విశాలాక్షిగా భక్తులకు దర్శన మిచ్చారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని పాతపేట దుర్గమ్మ, కొత్తపేట బసవన్న, శివాలయాల్లో శుక్రవారం దుర్గాదేవి మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పెద్దిరెడ్డి జన్మదినం.. సామాజిక సేవలు ఘనం



పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్మన్





సదుం: కేక్ కట్ చేస్తున్న పెద్దిరెడ్డి, కేక్ కట్ చేసి సంబరాలు చెసుకుంటున్న పీఎన్ నాగరాజు



చౌడేపల్లె ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న నేతలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

సదుం: మండల కేంద్రంలో రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పార్టీ శ్రేణులు పూజలు చేసి కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. అలాగే కొలింపల్లె క్రాస్‌లో ఎత్తైన పెద్దిరెడ్డి కటౌట్‌ను ఏర్పాటుచేసి కేక్ కట్ చేసి అన్నదానం చేశారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మోటుమల్లెల గ్రామ పంచాయతీలోని పెండ్లికన్నం వద్ద కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని బస్టాండ్‌లో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత రాజేష్ ఆధ్వర్యంలో రెండువేల మందికి అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం/కుప్పం రూరల్: స్థానిక మున్సిపల్ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ డాక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నేతలు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

కల్లూరులో..

కల్లూరు(పులిచెర్ల): మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ నాథమునిరెడ్డి పాల్గొన్నారు.

వి.కోట: మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పూతలపట్టు టోల్‌ప్లాజా వద్ద ఆయన్ను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వి.కోట: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎన్ నాగరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయన స్వగృహం వద్ద పార్టీశ్రేణులతో బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆపార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు.

బండ.. దందా దండి!



వాయుబండ దందా దండిగా సాగుతోంది. ఏజెన్సీలు గృహావసరాల సిలిండర్లను వాణిజ్య సంస్థలకు మళ్లిస్తుండగా.. గ్యాస్ డెలివరీ బాయిస్ అడిగినంత ఇవ్వకుంటే వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. అసలు ధర కన్నా కొసరు ఎక్కువగా గుంజేస్తున్నారు. గ్యాస్ దందాపై కథనం.

- పక్కదారి పడుతున్న సబ్సిడీ సిలిండర్లు
- వినియోగదారుల పేరిట బుక్ చేసి ఇతరులకు విక్రయం
- అక్రమార్జనే లక్ష్యంగా డీలర్ల ఎత్తులు
- మరోపక్క డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లు
- వాణిజ్య అవసరాలకు గృహావసరాల సిలిండర్ల అమ్మకం

కాణిపాకం: గ్యాస్ సిలిండర్ల దందా యథేచ్ఛగా సాగుతోంది. డీలర్లు వినియోగదారుల పేరిట సిలిండర్లు బుక్ చేసి ఇతరులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఎవరైనా ప్రశ్నిస్తే పొరపాటు జరిగిందని దాటవేస్తున్నారు. వినియోగదారులకు సబ్సిడీ జమ అవుతున్నా.. సిలిండర్లను డీలర్లు ఇతరులకు అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు గృహావసరాల సిలిండర్లను హోటళ్లు, వాణిజ్య సంస్థలకు చేరవేస్తున్నారు. మరోపక్క డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లకు పాల్పడుతుండగా పౌరసరఫరాల సంస్థ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వినియోగదారులకే ఆంక్షలు

వినియోగదారుడికి గ్యాస్ సిలిండర్ కావాలంటే మొదట బుక్ చేసుకోవాలి. ఆ తర్వాత డెలివరీ సమయంలో ఓటీపీ చెప్పాలి. ఇదంతా సామాన్య వినియోగదారులకే వర్తిస్తుండగా.. కొందరు డీలర్లు ఇతరులకు మాత్రం ఎలాంటి ఆంక్షలు లేకుండా అమ్మేస్తున్నారని తెలుస్తోంది. ఏటా రెండు నుంచి మూడు సిలిండర్లు మాత్రమే బుక్ చేసుకునే వారిని లక్ష్యంగా చేసుకుని వారి పేరిట బుక్ చేసి ఇతరులకు బ్లాక్ లోవిక్రయిస్తున్నారు. ఈ సమయం వినియోగదారుడి సెల్ నంబర్‌కు బుక్ చేసినట్లు, డెలివరీ అయినట్లు మెసేజ్‌లతో పాటు ఓటీపీ కూడా వస్తోంది. కానీ ఓటీపీ కోసం ఎవరూ ఫోన్ చేయడం లేదు. దీంతో పనిలేకుండా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

ఇష్టారాజ్యం

వాణిజ్య అవసరాల కోసం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ వినియోగించడానికి వీల్లేదు. కానీ వాణిజ్య సిలిండర్ల ధర ఎక్కువగా ఉండడంతో కొందరు డీలర్లు హోటళ్లకు డొమెస్టిక్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. తోపుడుబండ్లపై నిర్వహించే టిఫిన్ సెంటర్లు మొదలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఈ సిలిండర్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ రాయితీతో సిలిండర్‌లు వస్తుండడం.. కొందరు ఏటా రెండు నుంచి మూడు మాత్రమే వాడుతుండడంతో వారి పేరిట సిలిండర్లు బుక్ చేసి వాణిజ్య అసరాలకు మళ్లించి, డీలర్లు సొమ్ము చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

నిద్రావస్థలో అధికారులు

జిల్లా వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల దందా యథేచ్ఛగా సాగుతున్నా పౌరసరఫరాల సంస్థ అధికారులు మాత్రం దృష్టి సారించడం లేదు. డీలర్లు లెక్కాపత్రం లేకుండా డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు విక్రయిస్తున్నా తనిఖీల మాటెత్తడం లేదు. గ్యాస్ గోడౌన్లలో కానీ, ఏజెన్సీల్లో కానీ తనిఖీ చేసిన దాఖలాలు లేవనే చెప్పాలి. ఇదే అదునుగా డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడ్డూ అదుపు లేకుండా దందా కొనసాగిస్తున్నారు.

డెలివరీ బాయ్స్ దందా..

డీలర్ల వ్యవహారం ఇలా ఉంటే.. సిలిండర్లు డెలివరీ చేసే సిబ్బంది తమ వంతుగా వసూళ్ల పర్వం సాగిస్తున్నారు. ఐదు కిలోమీటర్ల వరకు సిలిండర్ను ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి. 30 కి.మీ. అయితే రూ.10, అంతకుమించి దూరమైతే రూ.15 వసూలు చేసుకోవచ్చు. కానీ ఎక్కడైనా సరే సిలిండర్ తీసుకొస్తే చాలు రూ.30 నుంచి రూ.60 వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మరుసటి నెల ఆలస్యం చేయడమో లేదంటే డోర్ లాక్ చేసి అని దాటవేయడమో చేస్తున్నారని తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం

వినియోగదారులకు సంబంధం లేకుండా గ్యాస్ బుక్ చేసినట్లు, డెలివరీ ఇచ్చినట్లు మెసేజ్‌లపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం. ఇలా చేసే ఏజెన్సీలపై చర్యలు ఉంటాయి. అలాగే, డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడకుండా తనిఖీలు చేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేయాలి. –శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు